# గోద్రెజ్ సెక్యూరిటీ నుంచి హోమ్ కామ్స్

- స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటిపై నిఘా, ఆడియో



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ అండ్ బాయిస్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అనుబంధ సంస్థ గోద్రెజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్.... ఇళ్ల భద్రత కోసం త్వరలో మరో రెండు సరికొత్త ఉత్పత్తులను మార్కెట్‌లో విడుదల చేయబోతోంది. ఇవిఇ (ఈజీ వ్యూయింగ్ ఎవ్విరివేర్) సిరీస్ హోమ్ కెమెరాలుగా పిలిచే సిసిటివిలు, వీడియో డోర్ ఫోన్లను మరో వారం రోజుల్లో మార్కెట్‌లో విడుదల చేస్తున్నట్టు కంపెనీ గ్లోబల్ హెడ్ (మార్కెటింగ్, సేల్స్ ఇన్నొవేషన్) మెహర్నోష్ బీ.పిఠావాలా విలేకరులతో చెప్పారు. ఆయస్కాంతం ఉండే హోమ్ క్యామ్‌ను ఎలాంటి వైర్ల అవసరం లేకుండా ఎవరైనా ఇంట్లో ఎక్కడ కావాలంటే అక్కడ అమర్చుకోవచ్చు. వైఫై, యాప్‌లతో పని చేసే ఈ రెండు పరికరాలను స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానం చేసి ఇంట్లో లేదా ఇంటి బయట ఏమి జరుగుతుందో తెలుసుకోవచ్చన్నారు. వీటి ద్వారా మాట్లాడేటపుడు వీడియో, స్కైప్ యాప్ కంటే స్పష్టంగా ఉంటుందని కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం దేశంలో 8 శాతం గృహాల్లో మాత్రమే హోమ్ సెక్యూరిటీ పరికరాలు ఉన్నాయి. దీంతో తమ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుందని కంపెనీ ఆశిస్తోంది. మూడు మోడళ్లలో లభించే హోమ్ క్యామ్స్‌ను ధర పన్నులతో కలిపి రూ.5,500 నుంచి రూ.9,900కు, వీడియో డోర్ ఫోన్‌ను రూ.24,000కు అందిస్తామన్నారు. సొంత టెక్నాలజీతో అభివృద్ధి చేసిన ఈ పరికరాలకు సంబంధించిన సర్వర్లనూ దేశంలోనే ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో వీటిని నేపాల్, కెన్యా, యూరప్ దేశాలకూ ఎగుమతి చేసే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది.